# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-07-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్న గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.**

3. **బాలికల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి.**

4. **ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ పత్రాన్ని సమర్పించాలని సూచించిన రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి.**

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఈరోజు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పిచ్చుకలంక వద్ద ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దెబ్బతిన్న 117 గేట్ల స్థానంలో కొత్త గేట్ల ఏర్పాటుకు 152 కోట్ల 95 లక్షల వ్యయంతో చేపడుతున్న పనులను ప్రారంభించారు. తర్వాత స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం పిచ్చుకలంక గ్రామంలో కొత్తపేట నియోజకవర్గ రైతులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. కోనసీమ జిల్లా పర్యటన అనంతరం ఆయన ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టుకు చేరుకుని ఎర్త్ కమ్ రాక్ ఫిల్ - ఈసీఆర్ఎఫ్ పనులు, పవర్ హౌస్ నిర్మాణాలను పరిశీలించనున్నారు. అనంతరం అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. మత్స్యకారులకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు ఫిషింగ్ కేంద్రాలు, పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని

తెలిపారు. రాయితీతో పడవలను, చేపల వేట సామాగ్రిని అందజేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

..వాయిస్...30 సెకన్లు

-----------------------------

ప్రకాశం జిల్లా సింగరాయకొండలో రాష్ట్ర మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎస్ . సవిత ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా 60 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్టీ కాలనీ అప్రోచ్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం జ్యోతిబా పూలే బాలికల పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, విద్యార్థినులకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు.

-----------------------------

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి మరో కీలక ముందడుగు పడిందని విజయనగరం జిల్లాలో బెరీ అల్లాయ్స్ సంస్థ 12 వందల కోట్ల రూపాయల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ, ఈ ప్రాజెక్టు ద్వారా 813 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, విలువ ఆధారిత ఉక్కు ఉత్పత్తి పెరిగి దేశీయ ఉక్కు తయారీ రంగానికి మరింత బలం చేకూరుతుందని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, వ్యాపార సౌలభ్యం, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వ కృషి ఫలితంగానే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు, బనకచర్ల అనుసంధానానికి సంబంధించిన అంశాలపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్యంతర ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ప్రధాన పిటిషన్‌లో సాంకేతిక లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దిన తర్వాతే విచారణ చేపట్టగలమని ధర్మాసనం తెలిపింది. లోపాలు సవరించిన అనంతరం కేసులోని ఇతర అంశాలను పరిశీలిస్తామని పేర్కొంది. పిటిషన్‌పై విచారణ చేపట్టకుండానే ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడం సాధ్యం కాదని ధర్మాసనం తెలిపింది.

-----------------------------

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ పత్రాన్ని సమర్పించాలని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఫారం సమర్పణకు రేపే చివరి తేదీ అని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె స్పందిస్తూ, ఓటర్లు తమ వివరాలను ధృవీకరించుకోవడంతో పాటు అవసరమైన పత్రాలను జత చేయాలని సూచించారు. సహాయం కోసం సంబంధిత బూత్ లెవల్ అధికారి –బీఎల్‌వోని సంప్రదించాలని తెలిపారు.ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు గడువులోపు తమ వివరాలను అందజేయాలని పురందేశ్వరి సూచించారు.

-----------------------------

ప్రస్తుత ఖరీఫ్ పంటకాలంలో చిత్తూరు జిల్లాకు సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేయగా, ఇప్పటికే 7 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఎరువుల పంపిణీపై రైతులకు అవగాహన కల్పించేందుకు చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ-పంటలో నమోదైన సాగు విస్తీర్ణం ఆధారంగానే ప్రతి రైతుకు ఎరువుల కోటాను నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు తమ అవసరాన్ని బట్టి కేటాయించిన కోటా మేరకు ఒకేసారి లేదా విడతల వారీగా ఎరువులను పొందవచ్చని తెలియజేస్తూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

నంద్యాలలోని నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో సుమారు 15 వేల రూపాయల విలువైన క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందే అవకాశం ఉంటుందని, ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ -పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులు, వాటి పరిష్కారానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. పీజీఆర్ఎస్ సేవలను జిల్లా స్థాయితో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ ఫిర్యాదులను సంబంధిత కార్యాలయాల్లో నేరుగా సమర్పించడంతో పాటు, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ meekosam.ap.gov.in ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రేపు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్నారు. అలాగే అదే ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి బయటపడిన కారి చిన్నాను కూడా జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలివస్తున్నారు. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 20 గంటల సమయం పడుతోందని టీటీడీ వెల్లడించింది.అన్ని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లు పూర్తిగా

నిండిపోవడంతో భక్తులు శిలాతోరణం వరకు క్యూలైన్లలో వేచి ఉన్నారని తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేశామని నిన్న ఒక్కరోజే 90 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది.

--------------------------

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ –ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని పంచాయతీల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

=======================